
ప్రజాశక్తి

శనివారం 1 ఫిబ్రవరి 2025 | 5 | విజయనగరం



ఐసిడిఎస్ పీడీగా రుక్సానా బేగం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా రుక్సానా బేగం నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె కలెక్టరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె గుంటూరులో సిడిపిఒగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు.




కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఐసిడిఎస్ పీడీ రుక్సానా

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదలు జిల్లా అభివృద్ధి ఎండమావిగా మారిపోయింది. గతంలో రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అడుగడుగునా బిజెపికి లొంగిపోగా, తాజాగా టిడిపి, జనసేన.. బిజెపితో జతకట్టి పాలన చేస్తున్నాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్న మాటలు తప్ప చేతల్లో కనిపించలేదు. మరోవైపు మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం వికసిత్ భారత్ పేరిట జనాన్ని ఆశల పల్లకిలోకి నెడుతోంది. అందుకు తగ్గట్టు ప్రభుత్వం తరపున కేటాయింపులు ఉంటాయా? అందులో జిల్లా అందిస్తున్న సహకారం ఎంత? అన్నదానిపై ఆద్యంతం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. వీటన్నింటికీ మించి రాష్ట్ర విభజన నేపథ్యంలో వెనుకబడిన జిల్లాగా గుర్తించి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు.

ఆశలు తీరేనా?

రైల్వే ప్రాజెక్టులు పట్టాలెక్కేనా? ● సాగునీటి ప్రాజెక్టులకు సహకరిస్తారా?



నేడు కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గతంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర సాయం అందేది. యాక్సలరేటెడ్ ఇరిగేటెడ్ బెనిఫిట్ ప్రాజెక్టు స్కీమ్ (ఎఐబిపి) తోటపల్లి ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వందల రూ.కోట్లు మంజూరయ్యేవి. అందువల్లే ఆ ప్రాజెక్టు పూర్తిదశ వరకు వచ్చింది. బిజెపి అధికారంలోకి వచ్చాక ఎఐబిపి గ్రాంట్‌ను పూర్తిగా రద్దు చేసింది. ఇప్పటి వరకు తోటపల్లి ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా సాయం అందలేదంటే అతిశయోక్తి కాదు. ఏకంగా కేంద్ర ప్రభుత్వం సాయమందించే ప్రాజెక్టుల జాబితా నుంచే తొలగించారు. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్ పథకం ద్వారా పిల్లకాలువలు తవ్వకానికి, నీటి సంఘాల ఏర్పాటు, సంఘాల భవన నిర్మాణాలు, వాటిలో మౌలిక సదుపాయాలకు అవసరమైన నిధుల్లో కేంద్రం 50శాతం భరించాల్సివుంది. రామతీర్థసాగర్ ప్రాజెక్టు విషయంలో పిఎంకెఎస్‌వై ప్రధాన మంత్రి కృషి సంచయ యోజన పథకం ద్వారా నాబార్డు నుంచి రుణం తీసుకోవాలంటూ ఉచిత సలహానిస్తోంది. ఈ బాధ్యత నేరుగా కేంద్ర ప్రభుత్వమే తీసుకోవాల్సి వున్నప్పటికీ బడ్జెట్ కేటాయింపు పద్దుల్లో ఆ లెక్కలు చూపుతారో లేదో వేచి చూడాలి.

విజయనగరం రైల్వే జంక్షన్ ఉత్తరాంధ్రకే తలమానికంగా ఉంది. ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఒడిశాలోని రాయగడ మీదుగా విజయనగరానికి రైల్వే కనెక్టివిటీ ఉంది. ఇదే జంక్షన్ ఇటు ఆమదాలవలస, పలాస మీదుగా ఒడిశా రాజధాని భువనేశ్వర్ మీదుగా పశ్చిమబెంగాల్ కోల్‌కత్తా వంటి ఎన్నో మహానగరాలను కలుపుతుంది. అందుకు తగ్గట్టే ఇక్కడ ప్రయాణికుల తాకిడి ఉంటోంది. ఇంతటి ప్రాధాన్యతగల విజయనగరం రైల్వేస్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా తీర్చిదిద్దాలన్న ప్రతిపాదన చాలా కాలంగా ఉంది. ముఖ్యంగా పట్టాలకు ఒకవైపే స్టేషన్ ఉండడం వల్ల రైళ్లు వచ్చి వెళ్లే సమయాల్లో ఎక్కువ రద్దీ ఉంటోంది. దీన్ని దృష్టిలో వుంచుకుని పట్టాలకు పడమర దిక్కున కూడా స్టేషన్‌ను విస్తరించాలని, అందుకనుగుణంగా ఫుట్‌పాత్, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, భవనాలు నిర్మించాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ బిజెపి అధికారంలోకి వచ్చాక వాటి జోలికి వెళ్లడం లేదు. శ్రీకాకుళం జిల్లా గుణుపూర్ నుంచి మన జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, పార్వతీపురం, సాలూరు, పాచిపెంట మీదుగా అరకు వెళ్లే రైలు రోడ్డు వేయాలని, తద్వారా గిరిజన గ్రామాలకు సైతం రైలు ప్రయాణ సదుపాయం కల్పించాలనే ప్రతిపాదన ఉంది. మరోవైపు విజయవాడ, రాజమండ్రి నుంచి వచ్చే రైళ్లు నర్సీపట్నం నుంచి రాజాం మీదుగా శ్రీకాకుళం జిల్లా కేంద్రాన్ని కలుపుతూ మరో ప్రతిపాదన ఉంది.

జిల్లాలోని గిరిజన వర్సిటీకి తగినన్ని నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో, నిర్మాణ పనులు నిర్మాణం నత్తనడకన సాగుతున్నాయి. కేంద్రం ఆర్భాటంగా నడిపే జవహర్‌లాల్ నవోదయ విద్యాలయం, కేంద్రీయ విద్యాలయాల నిర్వహణ, సదుపాయాలకు తగిన నిధులు కేటాయించలేదు. ఖాళీపోస్టుల భర్తీకి చర్యలు లేవు. ఈ విధంగా ఈ విద్యాలయాల్లో నాణ్యమైన విద్య అందకపోవడానికి కేంద్రమే పరోక్షంగా కారణమౌతోంది. గిరిజన ప్రాంతంలో విద్య వైద్యాభివృద్ధికి పెట్టే ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతూ వస్తోంది. ఈనేపథ్యంలో జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏమేరకు నిధులు కేటాయిస్తుందో వేచి చూడాల్సిందే.

అమాంతంగా పెరిగిన రిజిస్ట్రేషన్లు

కిటకిటలాడిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ● పెరిగిన ఛార్జీలు నేటి నుంచి అమలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిడిపి కూటమి ప్రభుత్వం ఫిబ్రవరి 1 నుంచి భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచిన నేపథ్యంలో గత రెండు రోజులుగా జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిటలాడాయి. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచుతుందని వస్తున్న వార్తలతో ఇప్పటికే రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొనుగోలుదారులు అప్రమత్తమయ్యారు. తాజాగా 20 నుంచి 30శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచుతూ శనివారం నుంచి అమలుకు సిద్ధమైంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ, వాణిజ్య భూముల విలువ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరిగాయి. ఆ ప్రాంతంలో ఆ భూముల ప్రాధాన్యత, విలువను బట్టి ఛార్జీలను పెంచారు. ఈ నేపథ్యంలో గురు, శుక్రవారాల్లో జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అమ్మకం, కొనుగోలుదారులతో కిటకిట లాడాయి. విజయనగరం పరిధిలో తూర్పు, పశ్చిమ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 50 నుంచి 60 రిజిస్ట్రేషన్లు వరకు జరిగాయి. అయ్యన్నపేటలోని పడమర కార్యాలయం సబ్ రిజిస్ట్రార్ టి. రమేష్ మాట్లాడుతూ గురువారం 64 రిజిస్ట్రేషన్ల జరగగా 40 లక్షల రూపాయలు రెవెన్యూ వచ్చిందని, 31 సుమారు 50 రిజిస్ట్రేషన్లు జరగగా రూ.30 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు.



క్రయ, విక్రయదారులతో రద్దీగా మారిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

రాజకీయ పార్టీలు మోడల్ కోడ్ పాటించాలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం ఎంఎల్‌సి ఎన్నిక కోసం ఈనెల 29 న షెడ్యూల్ వెలువడినందున ఆ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోనికి వచ్చిందని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ ఎన్నిక కోసం విశాఖపట్నం జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని, విశాఖపట్నం శ్రీకాకుళం, విజయనగరం మన్యం, అనకాపల్లి, ఎఎస్‌ఆర్ జిల్లాల డి.ఆర్.ఓ లు సహాయ రిటర్నింగ్ అధికారులుగా ఉంటారని తెలిపారు. ఫిబ్రవరి 3 న విశాఖపట్నం జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేస్తారని తెలిపారు. మార్చి 8 లోపల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని స్పష్టం చేసారు. ఎం.ఎల్.సి ఎన్నిక పై శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి కలెక్టర్ పలు అంశాలను వివరించారు. ఎన్నికల కోడ్ సాధారణ ఎన్నికలకు ఉన్నట్లే ఉంటుందని, పొలిటికల్ ప్రతినిధుల అధికారిక కార్యక్రమాలు ఉండకూడదని, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని, పొలిటికల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని తెలిపారు. మోడల్ కోడ్ అమలు కోసం 27 ఎంసిసి బృందాలు , 27 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పని చేస్తాయని తెలిపారు. జిల్లా పరిషత్ సిఇఒ ఎంసిసి నోడల్ అధికరికా వ్యవహరిస్తారని తెలిపారు. నామినేషన్ వేయునపుడు అభ్యర్థితో పాటు మరో నలుగురు వ్యక్తులు హాజరు కావచ్చునని స్పష్టం తెలిపారు.

100 మీటర్ల దూరం లో మూడు వాహనాలను అనుమతిస్తారని తెలిపారు. నామినేషన్లను ఫిబ్రవరి 3 నుండి 10 వ తేదీ వరకు పని దినాలలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మోడల్ కోడ్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలని తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ శ్రీనివాస మూర్తి, ఆర్‌డిఒ కీర్తి, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


అధిక వడ్డీల బారి నుంచి రక్షించండి

ఎమ్మెల్యేకు పాత ఐడిఎస్‌ఎంటి షాపు యజమానుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అధిక వడ్డీల బారి నుంచి తమను రక్షించాలని పాత ఐడిఎస్‌ఎంటి షాపుల యజమానులు ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజును కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పాలక సంస్థకు చెందిన పాత ఐడిఎస్‌ఎంటి షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపులకు 2018 నుంచి రకరకాల కారణాలు చెబుతూ అద్దెలు స్వీకరించలేదన్నారు. కరోనా సమయంలో వ్యాపారాలు నిలిచిపోయినా కార్పొరేషన్ రెవెన్యూ విభాగం అధికారులు లక్షలాది రూపాయలు వడ్డీలు విధించి, భయాందోళనకు గురిచేసి, తాళాలు వేసి బయటకు గెంటేశారని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, కుటుంబంలోని మహిళల బంగారు వస్తువులు తాకట్టు పెట్టి, అద్దెలు, వడ్డీలు చెల్లించామన్నారు. మళ్లీ లక్షల రూపాయల వడ్డీలు, అద్దెలు చెల్లించాలని పదుల సంఖ్యలో రెవెన్యూ సిబ్బంది షాపుల చుట్టూ తిరుగుతూ భయపెడుతున్నారని వాపోయారు. వడ్డీలు పక్కన పెట్టి అసలు చెల్లించాలని గతేడాది సెప్టెంబర్‌లో కమిషనర్.. ఆర్‌ఒని ఆదేశించారని గుర్తుచేశారు. కాని రెవెన్యూ విభాగంలో కొంతమంది సిబ్బంది కమిషనర్‌కి లేనిపోనివి చెప్పి వడ్డీలతో సహా కట్టాలని ఒత్తిడి ప్రారంభించారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని అనేక దఫాలుగా కమిషనర్ దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేదన్నారు. షాపు నంబర్ 115కు 8 ఏళ్లకు రూ.49 వేలు వడ్డీ విధించారని, అదే పద్ధతిలో స్వల్ప వడ్డీతో విడతల వారీగా బకాయిలు చెల్లించుటకు అవకాశం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అధ్యక్ష, కార్యదర్శులు బి.శంకరరావు, సన్యాసిరాజు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఇంటర్, ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలపై తమ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో శుక్రవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇంటర్ అర్హతా పరీక్షలు శని, సోమవారాల్లో జరుగుతాయని, ఫిబవరి 10నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయని ఆర్‌ఐఒ మజ్జి ఆదినారాయణ తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటలు వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటలు వరకు జరుగుతాయని చెప్పారు. ఒకేషనల్ కోర్సు పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి ప్రారంభం అవుతాయన్నారు. ఇంటర్ థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి నిర్వహిస్తారని చెప్పారు. ఇంటర్ పరీక్షలకు మొత్తం 41,270 మంది హాజరు కానున్నారని, వీరిలో 35,253 మంది సాధారణ ఇంటర్, 6017 మంది ఒకేషనల్ ఇంటర్ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. మొదటి సంవత్సర పరీక్షలకు 20902 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 20368 మొత్తం హాజరవుతారని చెప్పారు. సాధారణ ఇంటర్ పరీక్షల కోసం 93, ఒకేషనల్ పరీక్షలకు కోసం 38 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 793 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు వివరించారు.

డిఇఒ యు.మాణిక్యం నాయుడు మాట్లాడుతూ, మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు జరిగే ఎపి ఓపెన్‌స్కూల్ ఇంటర్ పరీక్షలకు 1313 మంది విద్యార్థులు హాజరవుతారని, వీరిలో 1087 మంది రెగ్యులర్, 226 మంది ప్రయివేటు విద్యార్థులు ఉన్నారని చెప్పారు. వీరికోసం జిల్లాలో 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 60 మంది ఇన్విజిలేటర్లను నియమిస్తున్నట్లు చెప్పారు.

కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ఇంటర్ పరీక్షలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ విధించాలని, జెరాక్స్ షాపులను మూసివేయాలని చెప్పారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా మౌలిక వసతులను కల్పించాలని, పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేందుకు వీలుగా ఆర్‌టిసి బస్సులను నడపాలని చెప్పారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ లక్ష్మణరావు, డిఎంఅండ్‌హెచ్‌ఒ జీవనరాణి, మున్సిపల్ కమిషనర్లు, డిఈసిలు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

సూర్య ఆస్పత్రిపై ఫిర్యాదు

వైద్య, ఆరోగ్య శాఖ , పోలీసులు సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ కుమారుడు మజ్జి జశ్వంత్ (14) మృతికి కారణమైన సూర్య హాస్పటల్ వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం బాలల హక్కుల ఛైర్మన్ కేసలి అప్పారావుకు నగరంలోని హుకుంపేటకు చెందిన మజ్జి సతీష్ కుమార్, జ్యోతి దంపతులు ఫిర్యాదు చేశారు. తమ కుమారుడు మజ్జి జశ్వంత్ ఎపి మోడల్ స్కూల్లో 9వ తరగతి చదువుతుండగా ఈనెల 6న కళ్ళు తిరిగి పడిపోయాడని తమకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వెళ్లి సూర్య ఆస్పత్రికి తరలించామని తెలిపారు. అక్కడి సిబ్బంది సెలైన్ ఎక్కించి, ఇంజక్షన్ చేశారని, చికిత్స అందిన కొద్దిసేపటికే తమ బిడ్డ జశ్వంత్ మరణించాడని, అయినా కూడా స్కేన్ చేయించమని, టెస్టులు చేయించమని చెప్పి తమను మభ్యపెడుతూ , దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తమ బిడ్డ మృతి చెందారని కమిషన్ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. తమకు జరిగిన అన్యాయం మరొకరికి జరకూడదని , రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహారించిన వైద్యులు, వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఛైర్మన్ స్పందిస్తూ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారికి ముగ్గురుతో కూడిన కమిటీని నియమించి, మూడు రోజులోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సంఘటనపై విచారణ చేయాలని వన్‌టౌన్ సిఐకి ఆదేశించారు. తప్పు జరిగినట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలకు ఆదేశిస్తామని ఛైర్మన్ తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన శుక్రవారం నగరంలోని ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి .చిన్నబాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పోరాడిన నాయకులలో గాంధీజీ ముందు వరుసలో ఉంటారని అటువంటి గాంధీజీని ఆర్‌ఎస్‌ఎస్ ఉగ్రవాది గాడ్సే 1948 జనవరి 30న కాల్చి చంపారని తెలిపారు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడిన ఆర్‌ఎస్‌ఎస్ నేడు దేశభక్తి, దేశద్రోహులు అంటూ ప్రజల మధ్య చీలిక తెస్తుందని అసలైన దేశద్రోహులు, సంఘవిద్రోహ శక్తులు ఆర్‌ఎస్‌ఎస్ వారని దుయ్యబట్టారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆపదలో ఉన్న వ్యక్తులకు మనం అందించేందుకు రక్తదానం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సాటివారికి సాయం చేయాలనే దృక్పథం కలగడం రేపటి మంచి భవిష్యత్తుకు పునాదులు అని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. రక్తదాన శిబిరంలో మొత్తంగా 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవి కుమార్, కె.జగదీష్ ,జిల్లా సహాయ కార్యదర్శి శిరీష, సోమేశ్, పట్టణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సూరిబాబు, రాజు, రాహుల్, కళ్యాణి, తిరుమల ప్రసాద్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎపిజిఇఎ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్. సూర్యనారాయణ జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను మర్యాదపూర్వకంగా శనివారం ఆయన ఛాంబర్ లో కలిశారు. జిల్లా ఉద్యోగుల సంఘం సమావేశాల కోసం ఏదయినా భవనాన్ని కేటాయించాలని, శాశ్వత భవన నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి .రామచంద్ర రావు, ఎపిజిఇఎ రాష్ట్ర కార్యదర్శి యుగంధర్ , జిల్లా అధ్యక్షులు కంది వెంకటరమణ, జిల్లా కార్యదర్శి బలివాడ బాల భాస్కర్, పెన్షనర్స్ సంఘ జిల్లా అధ్యక్షులు రామచంద్ర పండా, ప్రధాన కార్యదర్శి తిరుపతి రావు, రాష్ట్ర పెన్షనర్ సంఘం కార్యవర్గ సభ్యుడు పివి రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులంతా పింఛనుదారుల సమస్యలపై వివరించారు.



మోకాళ్లపై నిలబడిన నిరసన తెలుపుతున్న నాయకులు, ఆతవ గ్రామస్తులు

ఆతవ రోడ్డు పనులు ప్రారంభించాలని

మోకాళ్లపై నిల్చొని నిరసన

ప్రజాశక్తి-వేపాడ

సోంపురం కూడలి - ఆనందపురం ప్రధానరహదారి నుంచి ఆతవ గ్రామానికి వెళ్లే రోడ్డు పనులు ప్రారంభించాలని ఆ గ్రామస్తులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభించాలని ఆతవ గ్రామస్తులు చేపట్టిన నిరసనను ఐదో రోజు శుక్రవారం కొనసాగించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఇచ్చిన హామీ మేరకు రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పనులు ప్రారంభించే వరకూ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్ల జగన్, ఆతవ ఉదయ భాస్కర్, కె.దేముడు, చప్ప నూకరాజు పాల్గొన్నారు.

పిఎంఎంఎస్‌వై కింద మత్స్యసంపద అభివృద్ధి

విజయనగరంకోట : ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద జిల్లాలో మత్స్యసంపదను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. పిఎంఎంఎస్‌వై పథకం అమలుపై తమ ఛాంబర్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ఐదేళ్లపాటు అమలు కానుందని తెలిపారు. ఈ పథకం కింద మహిళలు, ఎస్‌సి, ఎస్‌టిలకు 60శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. ప్రస్తుత చివరి సంవత్సరంలో జిల్లాలోని 110 చెరువుల్లో చేప పిల్లల పెంపకానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పదిలక్షల చేపపిల్లలను పెంచడం ద్వారా 4వేల మంది మత్స్యకారులకు ఉపాధి లభించనుందని చెప్పారు. సుమారు 4వేల మంది మత్స్యకారులకు 9.84లక్షలను సబ్సిడీ క్రింద విడుదల చేసేందుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. సమావేశంలో మత్స్యశాఖ డిడి ఎన్.నిర్మలాకుమారి, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, పశు సంవర్ధకశాఖ జెడి వైవి రమణ, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, డిటిడబ్ల్యూఒ శ్రీనివాస్, ఎఎల్‌డిఎం ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విజయనగరం కోట : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని 1వ పట్టణ సిఐ శ్రీనివాస్ అన్నారు. వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శుక్రవారం తోటపాలెంలోని సత్య కళాశాలలో విద్యార్థులకు సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలు ఏమిటి, శరీరంపై శారీరకంగా మానసికంగా ఏ విధంగా వాటి ప్రభావం ఉంటుంది, వాటి జోలికి వెళ్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ఆవరణలో ఫిర్యాదుల కోసం డ్రాప్ బాక్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రామ్‌గణేష్, ప్రిన్సిపల్ డాక్టర్ సాయిదేవమణి, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు డాగ్ వీనాకు నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

అధికార లాంఛనాలతో పోలీసు డాగ్‌కు అంత్యక్రియలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసుశాఖలో స్నిఫర్ డాగ్ గా విశేషమైన సేవలందించిన పోలీసు డాగ్ వీనా (12) వృద్ధాప్యంతో శుక్రవారం మృతి చెందింది. ఈనేపథ్యంలో అధికార లాంఛనాలతో అయ్యన్నపేట శ్మశాన వాటికలో దానికి అంత్యక్రియలు నిర్వహించినట్లు ఎస్‌పి తెలిపారు. 2014లో ఫిమేల్ స్నిఫర్ డాగ్ గా 'వీనా' ఇంటిలిజెన్సు విభాగంలో శిక్షణ పూర్తి చేసుకొని జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. డాగ్ వీనా తన చివరి శ్వాస వరకు జిల్లా పోలీసుశాఖకు సేవలందించిందన్నారు. జిల్లాకు ముఖ్య వ్యక్తులు విచ్చేసే సమయంలో వారి భద్రతకు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ చేపట్టే ముందసు భద్రత చర్యల్లో చురుకుగా పాల్గొని, ఎక్స్‌ప్లోజివ్స్ ను గుర్తించేందుకు తనిఖీలు నిర్వహించేదన్నారు. డాగ్ వీనాకు ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, ఎఆర్ డిఎస్‌పిలు యూనివర్స్, ఆర్‌ఐలు టి.శ్రీనివాసరావు, ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్ కుమార్, పలువురు ఆర్. ఎస్.ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం అయ్యన్నపేట శ్మశాన వాటికలో డాగ్ వీనాకు అంత్యక్రియలు నిర్వహించారు.

బాల్య వివాహాల ఆలోచనే రానివ్వొద్దు

ప్రజాశక్తి-విజయనగరంకోట

మిషన్ వాత్సల్య కార్యక్రమం కింద బాలల సంక్షేమం, పరిరక్షణ కోసం గ్రామ స్థాయిలో సర్పంచ్ ఆధ్వర్యం లో కమిటీ ని ఏర్పాటు చేసి ప్రతి 15 రోజులకు ఒక సారి సమావేశం నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం జిల్లా స్థాయి బాలల పరిరక్షణ కమిటీ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి కమిటీ లో మహిళా పోలీస్ కన్వీనర్ గా ఉంటారని, పంచాయతీ సభ్యులు, ఉపాధ్యాయులు, ఎన్‌జిఒలు, ఆరోగ్య వర్కర్స్ తదితరులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. గ్రామస్థాయి సమావేశాల్లో అనాధ పిల్లల్ని, స్కూల్ డ్రాప్ ఔట్స్‌ను, గుర్తించాలన్నారు. బాల్య వివాహాలు, ట్రాఫికింగ్, దోపిడీ తదితర అంశాల పై చర్చించాలని అన్నారు. బాలల హక్కుల సంరక్షణ పై అవగాహనా సదస్సులు నిర్వహించాలని, నైపుణ్య శిక్షణలు, కెరీర్ కౌన్సిలింగ్ తదితర కార్యక్రమాలను నిర్వహించి పునరావాసం కల్పించాలని తెలిపారు. గ్రామస్థాయిలో నిర్వహించిన కమిటీలో చర్చించిన అంశాలను జిల్లా స్థాయి కమిటీకి పంపించాలని ఆదేశించారు. బాలల ఆరోగ్యం పై పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించాలని, మానసిక పరిస్థితులను కూడా తనిఖీ చేసి కౌన్సిలింగ్ నిర్వహించాలని డిఇఒలకు తెలిపారు. కర్మాగారాలు, హోటళ్లలో పని చేసే బాలికలను గుర్తించాలని లేబర్ కమీషనర్ కు సూచించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ రుక్సానా బేగం, డిఎంహెచ్ఒ జీవనరాణి, డిఇఒ మాణిక్యం నాయుడు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, జెడ్‌పి ఇసిఒ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాగునీటిని వృథా చేయరాదని ప్రజలకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. వార్డు పర్యటనలో భాగంగా శుక్రవారం 16వ డివిజన్‌లో పర్యటించి సమస్యలను తెలుసుకుని సాధ్యమైన పనులను అక్కడికక్కడే పరిష్కరించారు. తాగునీరు వృథాగా పోతున్న విషయాన్ని గమనించి, నీటిని వృథా చేయరాదని మహిళలకు సూచించారు. అక్కడక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్స్ బ్యానర్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అంబటిసత్రం రహదారిపై టిఫిన్ దుకాణాలు, తోపుడు బళ్ళు ఉండడానికి గమనించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందిన నాడే స్త్రీ సాధికారత సాధ్యమవుతుందని కమిషనర్ పల్లి నల్లన్నయ్య అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా మెప్మా బజారును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. వివిధ మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించే నిమిత్తం మెప్మా ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్ ను ఏర్పాటు చేశారు. మహిళా సంఘాల అభివద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ ఈ సందర్భంగా సూచించారు. మన ఉత్పత్తులను మనమే కొనుగోలు చేయడం ద్వారా మన సమాజంలో ఉన్న స్త్రీలు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టిపిఆర్ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, వివిధ డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

షూటింగ్‌లో భవానికి బంగారు పతకం


సాధించిన పతకాలతో భవాని, కోచ్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణానికి చెందిన పి.భవాని పిస్టల్ షూటింగ్‌లో బంగారు పతకం సాధించింది. 2021లో సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్‌గా భవాని ఉద్యోగం సాధించింది. పిస్టల్ షూటింగ్‌లో ప్రతిభ కనబరచడంతో సెంట్రల్ షూటింగ్ టీమ్‌లో ఆమె విధులు నిర్వహిస్తోంది. 10 మీటర్ల షూటింగ్‌లో బంగారు, కాంస్య పతకాలు సాధించినట్లు భవాని తెలిపింది. వీరబొబ్బిలి క్రీడా మైదానంలో శుక్రవారం ఆమెను కోచ్ శ్రీనివాసరావు అభినందించారు. వీర బొబ్బిలి క్రీడా మైదానంలో ఉచిత శిక్షణ తీసుకుని ఉద్యోగం సాధించినట్లు భవాని తెలియజేసింది.

పాఠశాల ప్రహరీ నిర్మాణం అడ్డగింత

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పూసపాటిపాలెంలో ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణాన్ని గ్రామానికి చెందిన వాళ్లే అప్పన్న కుటుంబం అడ్డుకుంది. పాఠశాలకు ప్రహరీ నిర్మిస్తున్న స్థలం తమదని అడ్డగించడంతో తహశీల్దార్ గోవింద రంగంలోకి దిగారు. శుక్రవారం ఆ పాఠశాలకు తహశీల్దార్ చేరుకొని, ఆయా కుటుంబాలతో మాట్లాడారు. ప్రహరీ నిర్మిస్తున్న స్థలానికి సంబంధించిన పత్రాలు చూపించాలని వారిని అడిగారు. సోమవారం వరకు సమయం ఇస్తున్నామని, ఆలోగా పత్రాలు చూపించకుంటే ప్రహరీ నిర్మాణం చేపడతామని వారికి స్పష్టంచేశారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. మున్సిపల్ శానిటరీ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి, మస్తర్ రికార్డును పరిశీలించారు. విధులకు సకాలంలో హాజరు కావాలని, ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. సచివాలయాల పారిశుధ్య కార్యదర్శులతో సమావేశమై డిఅండ్ఒ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు పూర్తిగా వసూలు చేయాలని ఆదేశించారు. మెయిన్ రోడ్ ఏరియాలో రోడ్లపై చెత్త వేయకుండా చూడాలని సూచించారు. మార్కెట్ ఏరియాలో పైప్‌లైన్ మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయించాలని మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్‌కు సూచించారు. మార్కెట్ ఏరియాలో ఉదయం ఏడు గంటలలోపే పారిశుధ్య పనులు పూర్తిచేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కి స్పష్టంచేశారు. అనంతరం కంచర వీధిలో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

ప్రజాశక్తి-బాడంగి

మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపారు. మండలంలోని కోడూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి సమయంలో పాఠశాలలో, బడి వదిలితే ఇంటికి వెళ్లి హోంవర్క్ చేయాలని చెప్పారు. మీ కంటే పెద్దవాళ్లు సరదాగా తిరుగుదామని పిలిస్తే వెళ్లొద్దని, ఎవరైనా మత్తు పదార్థాలతో ఉన్న బిళ్లలు, సిగరెట్లు ఇస్తే తీసుకోవద్దని సూచించారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని కోరారు. సైబర్ నేరాలు, పిల్లలపై అత్యాచారాలపై అవగాహన కల్పించారు.

నూరు శాతం వసూళ్లకు చర్యలు

ప్రజాశక్తి-రేగిడి

బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్న మహిళా సంఘ సభ్యుల నుంచి ఫిబ్రవరికి నూరు శాతం వసూళ్లకు చర్యలు తీసుకోవాలని ఎపిఎం బి.గోవిందరావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం సిసిలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహిళా సంఘాలకు స్త్రీనిధి, సామాజిక పెట్టుబడి నిధి , ఎస్‌సి, ఎస్‌టి నిధుల రుణాలు అందజేసినట్లు తెలిపారు. రుణాలు తిరిగి కట్టేలా చర్యలు తీసుకుని, లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. మహిళా సంఘాల బ్యాంకు లింకేజీలు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు.

నేడు నైతిక విలువలపై పరీక్ష

ప్రజాశక్తి-వేపాడ

వేపాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నైతిక విలువలపై పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని చెప్పారు.

యాడికలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని యాడిక గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 1326 పశువులకు, సన్న జీవులకు, దూడలకు, కోళ్లకు నట్టల మందులు పట్టడం, టీకాలు వేయడం, గర్భ కోస వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసినట్లు మండల పశు వైద్యాధికారి సిహెచ్ హైమావతి తెలిపారు. షీప్ పాక్స్, గోట్ పాక్స్, ఫోల్ పాక్స్ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులకు సొంత భవనం కేటాయించాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

వికలాంగులకు సొంత భవనం కేటాయించాలని వికలాంగుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎన్.జేసుదాసు.. శుక్రవారం కలెక్టర్‌కు వినతి అందించారు. వికలాంగుల కార్యకలాపాలు, సమావేశాలు నిర్వహించడానికి సొంత భవనం లేదని విన్నవించారు. తమ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవనం కేటాయించాలని కోరారు.

ముగిసిన జాతర

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడులో నిర్వహించిన మరిడిమాంబ జాతర శుక్రవారం ముగిసింది. ముగింపు సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 20 ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. విజేతగా నిలిచిన ఎడ్లబండి యజమానికి రూ.18 వేలు, రన్నర్‌కు రూ.16 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.14 వేలతోపాటు తొమ్మిది స్థానం వరకు నిలిచిన వారికి నగదు బహుమతులను సర్పంచ్ బీల రాజేశ్వరి, డిసిసిబి మాజీ చైర్మన్ వివి చినరామినాయుడు అందజేశారు. జాతర సందర్భంగా గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బీల సతీష్, బొబ్బిలి అప్పారావు, రాజునాయుడు, బీల దేవుడునాయుడు, తదితరులు పాల్గొన్నారు.


తిరుపతినాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

మచ్చలేని వ్యక్తి తిరుపతినాయుడు

మాజీ ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి, విజయనగరం కోట

ఎంపిడిఒ డి.తిరుపతినాయుడు మచ్చలేని వ్యక్తని, ఎందరో ఉద్యోగులకు ఆదర్శం నిలిచారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ తిరుపతినాయుడు ఉద్యోగ విరమణ సభను ఎంపిపి మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి అరుణ, ఎఒ గంట వెంకటరావు, టిడిపి మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు మాట్లాడుతూ తిరుపతినాయుడు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


బొబ్బిలి.. గొల్లపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రామ్మోహనరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నారు. గతంలో రాజా కళాశాలలో ఎన్నికలు నిర్వహించే వారు. రాజా కళాశాల ఎయిడెడ్ నుంచి ప్రయివేట్ కళాశాలగా మారడంతో గొల్లపల్లి మున్సిపల్ పాఠశాలలో పోలింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆర్‌డిఒ రామ్మోహనరావు, డిఎస్‌పి జి.భవ్యరెడ్డి పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ఎన్నికల డిటి గౌరీశంకర్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నగర పంచాయతీ పరిధిలో బాలికోన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ పి.సుదర్శన రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు బాలికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని హెచ్‌ఎం, సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథరావు, విఆర్ఒ రెడ్డి గోవిందరావు, విఆర్‌ఎ సూరిబాబు, ఎఎస్‌ఐ మూర్తి పాల్గొన్నారు.

రామభద్రపురం : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ సులోచనారాణి, ఎంపిడిఒ రత్నం, ఎస్ఐ ప్రసాదరావు పరిశీలించారు. ఉద్యోగులంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని కొత్తూరు గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు తహశీల్దార్ అరుణకుమారికి శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జి.సూర్యనారాయణ మాట్లాడుతూ కొత్తూరు రెవెన్యూ సర్వే నంబర్ 84-8లో ప్రభుత్వ భూమిని గుడివాడ శ్రీరాములు అనే వ్యక్తి ఆక్రమించి, రేకుల షెడ్డు నిర్మించుకున్నాడని తెలిపారు. దీనిపై గతంలో ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఇప్పుడు ఇంటి నిర్మాణం చేపడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. వెంటనే నిర్మాణాన్ని తొలగించి, ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడు అప్పారావు, మద్దిల రమణ, కె.రవికుమార్, జి.లావణ్య, మణి తదితరులు పాల్గొన్నారు.


శృంగవరపుకోట తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నాయకులు, కొత్తూరు గ్రామస్తులు

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

బొబ్బిలిరూరల్ : పట్టణ పరిధిలోని చెరువులు, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో డిటి సుబ్బారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్‌లో సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని చెప్పారు. దీనిపై గతంలో తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో ఆ భూమి ఆక్రమణకు గురైందని తెలిపారు. ఐటిఐ కాలనీ ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న కొంత స్థలం ఆక్రమణకు గురైందని చెప్పారు. పక్కా ఆధారాలతో రెవెన్యూ యంత్రాంగానికి తెలియజేసినా తహశీల్దార్ మౌనం వహించడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నా ఉపయోగం లేదని, వెంటనే ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్. జిల్లా నాయకులు కోట అప్పన్న, పట్టణ నాయకులు పాలూరి కృష్ణ. బి.తులసి పాల్గొన్నారు.

ఎంఆర్ కళాశాలలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎంఆర్ కళాశాలలో మూడు రోజులు పాటు జరిగే జాతీయస్థాయి సైన్స్ అకాడమీ లెక్చర్ వర్క్ షాప్ (కార్యశాల) శుక్రవారం ప్రారంభమైంది. 'గణితశాస్త్రంలో నూతన పోకడలు' అనే అంశంపై మహారాజా కళాశాల గణిత శాస్త్ర విభాగం, బెంగళూరుకు చెందిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వారి సౌజన్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్. రాజుతో పాటు మాన్సాస్ విద్యాసంస్థల కరెస్పాండెంట్ డాక్టర్ కె.వి.ఎల్.రాజు, కార్యశాల చైర్మన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సాంబశివరావు, సెక్రటరీ గణిత శాస్త్ర విభాగాధిపతి ఎస్.సూరిబాబు, చెన్నై మేథమెటికల్ ఇనిస్టిట్యూట్ సైన్స్ ప్రొఫెసర్లు డిశంత్ పాంచోలి, ప్రొఫెసర్ మనోజ్, ప్రొఫెసర్ బి.వి.రావు, ప్రొఫెసర్ కృష్ణ హనుమంతు పాల్గొన్నారు. వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, గణిత శాస్త్రం ఇంజినీరింగ్, మెడిసిన్, ఆర్థికం, ద్రవ్య, సామాజిక రంగాలలో ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉందని అన్నారు. గణితశాస్త్ర అధ్యాపకులు చక్కని విషయ పరిజ్ఞానం, బోధన పటిమను కలిగి ఉంటూ, ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకుంటూ, చమత్కార భాషణం చేయగలిగినట్లు ఉండి, విద్యార్థులను ఉన్నత విద్య, ఉద్యోగం, పరిశోధన వైపు వెళ్లేట్లు తగిన విధంగా సూచలనలు, సలహాలు ఇవ్వాలని చెప్పారు. విద్యార్థులు మేధస్సు పదను పెట్టే విధంగా గణిత ప్రయోగశాలలో మౌఖిక కార్యకలాపాలు నిర్వహించాలని, గణిత క్లబ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు గణితం అంటే ఎంతో ఇష్టం కల్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో గణిత శాస్త్రం సీనియర్ అధ్యాపకులు సిఎస్‌కె ఉమా శంకర్ , బి. ఝాన్సీ , ఎం.స్వామి నాయుడు, టి.స్వాతి, ఎంవి లక్ష్మి . డి.రమేష్, డాక్టర్ శ్రీదేవి, నరేశ్, కళాశాల కన్వీనర్‌లు డి. సన్యాసి రావు, వి. బాజ్జి, పిఎస్‌ఎన్ రావు, గణపతిరావు, ఐక్యూ ఎసి కో ఆర్డినేటర్ అచ్చుతరావు పాల్గొన్నారు.


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకులు

రహదారికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని అల్లాడపాలెంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రెండో విడత కాలువలు, రహదారి నిర్మాణానికి శుక్రవారం జనసేన నాయకులు శంకుస్థాపన చేశారు. గ్రామానికి సుమారుగా రూ.20 లక్షలతో డ్రెయిన్లు, రహదారి నిర్మిస్తున్నట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షులు జలపారి శివ తెలిపారు. జనసేన నాయకులు లంకలపల్లి గొల్లారావు పాల్గొన్నారు.

జగన్‌ని కలిసిన శివారెడ్డి

ప్రజాశక్తి-భోగాపురం

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని భోగాపురం మండలం ఎ.రావివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి శుక్రవారం కలిశారు. లండన్ పర్యటన ముగించుకుని జగన్మోహన్ రెడ్డి బెంగళూరు విమానాశ్రయంలో దిగారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో ఆయనకు శివారెడ్డి స్వాగతం పలుకుతూ పలు విషయాలు చర్చించారు.


మాజీ సిఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచ్ శివారెడ్డి

మెగా డిఎస్‌సి ఏమైంది?

ఎఐవైఎఫ్

ప్రజాశక్తి-బొబ్బిలి

సిఎం చంద్రబాబునాయుడు ఆర్భాటంగా తొలిసంతకం చేసిన మెగా డిఎస్‌సి ఏమైందని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్ ప్రశ్నించారు. శుక్రవారం బొబ్బిలి పట్టణంలోని గంటి ప్రసాదం స్మారక భవనంలో నిర్వహిస్తున్న ఎఐవైఎఫ్ జిల్లా మహాసభకు హాజరైన ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగ కల్పన హామీ ఏమైందని నిలదీశారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, మెగా డిఎస్‌సి ఊసే లేదని విమర్శించారు. ఎన్నికల ముందు వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వారికి రూ.10 వేలు జీతం ఇస్తామని చెప్పిన పెద్దమనిషి.. వారందరినీ రోడ్డును పడేశారని దుయ్యబట్టారు. సుదీర్ఘ అనుభవం గల చంద్రబాబు నిరుద్యోగ యువతకు మాట ఇచ్చి తప్పడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, నాయకులు అలమండ ఆనందరావు, మునకాల శ్రీనివాస్, ఎపి విద్యార్థి జెఎసి రాష్ట్ర కార్యదర్శి బీసపు సాయికిరణ్ యాదవ్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.వాసు, కె.అప్పన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇఇ సురేష్

సూర్యఘర్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బొద్దాం గ్రామంలో శుక్రవారం పిఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. విజయనగరం రూరల్ డివిజన్ ఇఇ జి.సురేష్ మాట్లాడుతూ ఈ పథకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డిఇఇ బి.వెంకటరావు, ఎఇ సిహెచ్ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల రవాణాదారులపై రౌడీషీట్లు నమోదు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పెదమానాపురం సంత నుంచి పశువులను అక్రమ రవాణా చేస్తున్న వారిపై రౌడీషీట్లు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర నాయకులు కేదారిశెట్టి సత్యనారాయణ కోరారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో పెదమానాపురం పశువుల సంత అక్రమాలపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గోసంరక్షణ సమాఖ్య జిల్లా మహిళా అధ్యక్షులు చోళ్ల రాజకుమారి, కార్యదర్శి వేమల యమున పాల్గొన్నారు.

ఘనంగా వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రంలో వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచే ఆర్యవైశ్య మహిళలు పెద్దఎత్తున చేరుకొని పూజలు చేశారు. ప్రభుత్వం అధికారికంగా వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని గుర్తించి 181 జిఒ విడుదల చేయడం ఆనందంగా ఉందని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు పొట్టా రామారావు, యువజన సంఘం అధ్యక్షులు నడిపల్లి అన్నాజీరావు, సంఘం సభ్యులు దాసరి లక్ష్మణరావు, రామారావు తెలిపారు.

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్సీ దంపతులు

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరంలో వాసవి కన్యాకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, సుధారాజు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్సీ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసయ్య, నాయకులు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పొడవునా సహకార ఉత్సవాలు

నెలకో అంశంపై కార్యక్రమాలు నిర్వహణ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా పాటిస్తూ జిల్లాలో ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించామని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేస్తూ ప్రతి నెలా ఒక్కో అంశంపై కార్యక్రమాలు చేపట్టేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సహకార అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. డిసిసిబి ప్రస్తుత స్థితిని బ్యాంకు సిఇఒ ఉమామహేశ్వరరావు వివరించారు. బ్యాంకుకు రూ.350 కోట్లు డిపాజిట్‌లు వుండగా, రూ.1850 కోట్లు రుణాలుగా అందజేశా మన్నారు. బ్యాంకు ద్వారా అందజేసిన రుణాల రికవరీపై కలెక్టర్ ఆరా తీశారు. పార్వతీపురం జిల్లా పరిధిలోని మూడు బ్రాంచిల ద్వారా రూ.60 కోట్ల మేరకు బకాయిలు వసూలు కావలసి వుందని డిసిసిబి సిఇఒ చెప్పారు. దీనిపై అక్కడి అధికారులతో మాట్లాడి రుణాలు రికవరీ జరిగేలా చర్యలు చేపట్టాలని డిసిసిబి పర్సన్ ఇన్ ఛార్జిగా వ్యవహరిస్తున్న జె.సి. సేతుమాధవన్‌కు కలెక్టర్ సూచించారు. బ్యాంకింగ్ కార్యకలాపాలను పెంచడంతోపాటు పెద్ద ఎత్తున ఖాతాదారులను చేర్పించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఫిబ్రవరి 17 నుంచి 28 వరకు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డిసిసిబి పర్సన్ ఇన్చార్జి, జె.సి. సేతుమాధవన్, డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల శ్రమ దోపిడీ

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారావు

ప్రజాశక్తి - జామి

ఉపాధి పనులకు వెళ్లకుండా మస్టర్లు వేసి, కొలతలు తేడా చూపించి అవినీతికి పాల్పడటం అంటే... పనులు చేసిన కూలీల వేతనం తగ్గించి, వారి శ్రమ దోపిడీ చేయడమేనని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడు అప్పారావు, నాయకులు మద్దెల రమణ అభిప్రాయపడ్డారు. శుక్రవారం జామిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గత నెల 29న ప్రజా వేదికలో మండలంలో చేపట్టిన ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలను సోషల్ ఆడిట్ బృందం బట్టబయలు చేసిందన్నారు. కార్మికులకు ఇచ్చిన కొలతల్లో తేడాలు చూపించి, రాని వారిని వచ్చినట్టుగా మస్టర్లు వేసి, చనిపోయిన వారి పేరిట బిల్లులు చేసుకోవడం వల్ల నిజంగా పనికొచ్చిన కూలీలకు రోజువారి కూలి రేటు తగ్గుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ అంశం అధికారులకు తెలిసినా తెలియనట్టుగానే వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉపాధిహామీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్న అవినీతి అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి అధికారులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్‌చేశారు. మస్టర్లు అవినీతిని రూపుమాపాలంటే గతంలో ప్రభుత్వం ప్రకటించినట్లు సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లకు సహాయకులుగా తీసుకొని, వారికి ప్రతి నెల రూ.10 వేల జీతం చెల్లిస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టంలో నిధులను అభివృద్ధి పేరుతో రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం దారి మళ్లించి ద్వారా నాసిరకం పనులతో అడ్డంగా తినేస్తున్నారని చెప్పారు.

ఉపాధి హామీ కార్డుదారులందరికీ ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు వెంటనే పనులు, పని ప్రదేశంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. పనిముట్లు, తాగునీటి అలవెన్స్, వేసవిలో రాయితీలు చెల్లించాలని కోరారు. పని ప్రదేశాల్లో చనిపోయిన వారికి ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని, కార్మిక సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించరాదని డిమాండ్ చేశారు.

ఐఒబి బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి-డెంకాడ

చింతలవలసలోని ఐదో బెటాలియన్ మెయిన్ గేట్ ఎదురుగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను రీజనల్ మేనేజర్ విజయ్ కేతన్ సాహు, చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులో మోటార్, బంగారు, గృహ, తదితర రుణాలు తక్కువ వడ్డీకి ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు బ్యాంకు ఎంతో ఉపయోగపడుతుందని, బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వై.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


బ్రాంచ్‌ని ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్ విజయ్‌కేతన్

అప్పలనాయుడికి కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి -డెంకాడ


మండలంలోని మోదవలస గ్రామానికి చెందిన వైసిపి నాయకులు బోని అప్పలనాయుడికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. భోగాపురం మండలం నారుపేట వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో అప్పలనాయుడు మృతిచెందిన విషయం తెలిసిందే. సుందరపేట సిహెచ్‌సిలో పోస్టుమార్టం పూర్తయ్యాక శుక్రవారం మోదవలసలోని అప్పలనాయుడు నివాసానికి భౌతికకాయాన్ని ఊరేగింపుగా తరలించారు. గ్రామస్తులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించిన అనంతరం దహన సంస్కారాలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్ బాబు, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, పిఎసిఎస్ మాజీ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ తనయుడు బడ్డుకొండ మణిదీప్ నాయుడు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కంది సూర్యనారాయణ, నాయకులు రామభద్ర రాజు, త్రినాథరావు, లక్ష్మణరావు, మోదవలస సర్పంచ్ కనకల రామారావు, ఎన్నింటి కృష్ణ, తదితరులు ఉన్నారు.


అప్పలనాయుడు అంత్యక్రియల్లో పాల్గొన్న జనం

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్‌పై నుంచి జారి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మెరకముడిదాం


గౌరినాయుడు (ఫైల్)

వ్యవసాయ పనులు నిమిత్తం వెళ్లిన వ్యక్తి ట్రాక్టర్ పై నుండి జారిపడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రమైన మెరకముడిదాం గ్రామానికి చెందిన బాలి గౌరినాయుడు (50)వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబ పోషించుకుంటున్నాడు. శుక్రవారం నాడు మెరక ముడిదాం, సోమలింగాపురం గ్రామాల మధ్య పంట పొలాల్లో వరి గడ్డిని ట్రాక్టర్‌కు ఎక్కించడానికి వెళ్ళాడు. ట్రాక్టర్‌పై గడ్డి ఎక్కిస్తుండగా కిందకు జారి పడి పోయాడు. వెంటనే పక్కనే ఉన్న రైతులు కొంత మంది వచ్చి గౌరినాయుడు ను ఎత్తి మండల కేంద్రంలో ఉన్న ఒక ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యుడు తెలిపారు. గౌరినాయుడుకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో కన్నీరుమున్నీరయ్యారు. బుదరాయవలస సర్పంచ్ జె.లోకేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-కొత్తవలస

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం కొత్తవలస పోలీసులు అరెస్టు చేశారు. కొత్తవలస ఆర్‌టిసి కాంప్లెక్స్ బయట రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ సుదర్శన్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. రెండు బ్యాగులు పట్టుకొని పారిపోతుండగా వారిని పోలీసులు పట్టుకున్నారు. నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఇద్దరు తిరుపతికి చెందిన అరవ ప్రవీణ్‌కుమార్, కావడి మధుసూదన్‌గా గుర్తించారు. ఒడిశాలోని పాడువ గ్రామంలో గంజాయి కొనుగోలు చేశారు. అరకు నుంచి బస్సులో కొత్తవలస చేరుకుని, ఇక్కడి నుంచి రైల్లో వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఈలోగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు సిఐ షణ్ముఖరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని నరవ ఎంజి కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇందులో మురపాక గ్రామానికి చెందిన తమటాపు సత్తిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ సాయికృష్ణ అక్కడికి చేరుకున్నారు. క్షతగాత్రుడు సత్తిబాబును చికిత్స నిమిత్తం 108 వాహనంలో విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.